క్లుప్తంగా

రేపటి నుంచి చిత్రకళలో ఉచిత శిక్షణ

హన్మకొండ చౌరస్తా : సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మే 1 నుంచి 21 వరకు చిత్రకళలో వేసవి శిక్షణశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, పెయింటింగ్, క్రాఫ్ట్స్ వర్క్ అంశాల్లో శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్ ఉదయం 8–10 వరకు, రెండో బ్యాచ్ 10–12 వరకు, మూడో బ్యాచ్ సాయంత్రం 5–7గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు 81436 43337 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

పద్మశాలి సంఘం డివిజన్ అధ్యక్షుడిగా సుధాకర్

ఖిలావరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లో భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం భవనంలో బండారి సదానందం అధ్యక్షతన సోమవారం పద్మశాలిల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వడ్నాల నరేందర్, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అడెపు రవీందర్ హాజరై సంఘం 40వ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి సుధాకర్, కార్యదర్శిగా కళ్యాణపు వెంకటేశ్వర్లు, కోశాధికారి నాగేశ్వరరావు ఉన్నారు. పద్మశాలి సంక్షేమానికి మరింతగా కృషి చేస్తామని నూతన కమిటీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుడిమల్ల రాజు, బాసాని శ్రీనివాస్, సోమరాజు, శ్రీనివాస్, రవి, రాజయ్య, రాజమల్లు, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

శైలజకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని రాజనీతిశాస్త్ర విభాగం పరిశోధకురాలు మా మిడాల శైలజకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఉమెన్ ఎంపవర్‌మెంట్ త్రూ 73, 74 అమెండ్మెంట్ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శైలజకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం ఆచార్యులు వి.రాంచంద్రం పర్యవేక్షణలో ఆమె తన పీహెచ్‌డీని పూర్తి చేసింది. వరంగల్‌కు చెందిన శైలజ ప్రస్తుతం నర్సంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుంది.

పరామర్శ

కాశిబుగ్గ : రంగశాయిపేట డెవలప్‌మెంట్ సొసైటీ కాలనీస్ గౌరవ అధ్యక్షుడు శ్రీరామాంజు జగదీశ్వరస్వామి అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

ప్లేస్‌మెంట్స్‌కు విశేష స్పందన

హన్మకొండ అర్బన్ : హంటర్‌రోడ్డులోని న్యూ సైన్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాల కోసం నిర్వహించిన ప్రాంగణ నియామకాలకు విశేష స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.కమలాకర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అహ్మద్ ఖాన్‌లు తెలిపారు. వివిధ కళాశాలలకు చెందిన సుమారు 1125 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. వీరిలో 319 మంది వివిధ కంపెనీలో ఎంపికై, కంపెనీ ఆఫర్ లెటర్ కూడా అందుకున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సి పాల్ మధుకర్, శ్రావణ్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎండి యాకూబ్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన చిన్నారి



హన్మకొండ: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను చిన్నారి బ్రాహ్మణి కలిశారు. చిన్నారిని చూసిన కేసీఆర్ ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఫొటో దిగారు. వరంగల్ మహానగర పాలక సంస్థ 51వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి రంజిత్ రావు కూతురు బ్రాహ్మణితో కలిసి సోమవారం హనుమకొండలోని కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఇంటిలో కేసీఆర్‌ను కలిశారు. చిన్నారిని చూసిన కేసీఆర్ దగ్గరకు చేరదీసి ముచ్చటించారు.

మేడేను జయప్రదం చేయండి

వరంగల్ : మే 1న 138వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఊరూరా, వాడవాడలో ఎర్రజెండాలు ఎగురవేసి శ్రమ దోపిడికి వ్యతిరేకంగా, కార్మిక రాజ్యస్థాపన కోసం పోరాడేందుకు ప్రతినబూనాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు పిలుపునిచ్చారు.

మజ్జిగ పంపిణీ

కాశిబుగ్గ : కాశిబుగ్గలో లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సోమవారం చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు రాంప్రసాద్ మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

బీజేపీ ఫాసిస్టు విధానాలను వ్యతిరేకించండి

- కవులు, సాహిత్యకారులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి
- ఆయా సంఘాల నాయకుల పిలుపు



హన్మకొండ: ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, సాహిత్యకారులు

హన్మకొండ: ప్రజాస్వామ్య భారతదేశంలో భావ ప్రకటన స్వేచ్ఛను హరించి వేస్తూ పాలన కొనసాగిస్తున్న బీజేపీ దాని అనుబంధ సంస్థల ఫాసిస్టు విధానాలను దేశంలోని ప్రతి ఒక్కరూ ఖండించాలని, కాకతీయ విశ్వవిద్యాలయంలో సాహిత్యకారులు, కవులపై దాడి చేసిన మతోన్మాదులను వెంటనే అరెస్టు చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు, కవులు, సాహిత్యకారులు డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ కాకతీయ యూనివర్సిటీలో లౌకిక విలువలు – సాహిత్యం అనే అంశంపై జరిగిన సదస్సులో పాల్గొన్న సాహిత్యకారులు, కవులు, ప్రొఫెసర్లపై హిందూ మతోన్మాద మూకలు విచక్షణారహితంగా తిట్టి, భౌతికంగా దాడులు చేయడంపై హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, విముక్త చిరుతల కక్షి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, ప్రొఫెసర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, న్యూ డెమోక్రసీ నాయకుడు సున్నా అప్పారావు, ప్రజాస్వామ్య రచయితల వేదిక నాయకురాలు అనిశెట్టి రజిత, జైసింగ్ రాథోడ్, మార్క శంకర్ నారాయణ, సోమ రామమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, కొంద్ర నర్సింగరావు మాట్లాడుతూ భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా చేస్తున్న మతోన్మాద బీజేపీని దాని అనుబంధ సంఘాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సాహిత్యకారులు, కవుల మీద దాడి చేయడం హేయమైన చర్య అని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మాదిగలను మతోన్మాద పార్టీకి తాకట్టు పెట్టిన మంద కృష్ణ మాదిగ ఇలాంటి దాడులపై సమాధానం చెప్పాలన్నారు. మంద కృష్ణ, ఆరూరి రమేష్ ఈ దాడికి బాధ్యత వహించాలన్నారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్ : కేయూ లో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుండగా కవులు, రచయితలపై ఏబీవీపీ నాయకులు దాడులకు పాల్పడటంపై వామపక్ష, బహుజన విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించి నిరసన తెలిపారు. సోమవారం కేయూ మొదటి గేట్‌వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబూని మూతికి నల్లరిబ్బన్‌లు కట్టుకొని తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి, యూ ఎస్ ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదం తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మా లోతు రాజేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, పాల్గొన్నారు.

ఏబీవీపీ దాడి హేయమైన చర్య

న్యూశాయంపేట : కాకతీయ యూనివర్సిటీలో కవులు, రచయితలపై ఏబీవీపీ దాడి హేయమైన చర్య అని దాడి చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బి.చక్రపాణి డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వాసుదేవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో నాయకులు చుక్కయ్య, ఉప్పలయ్య, వీరన్న, వెంకట్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

దాడి సిగ్గుచేటు

నయీంనగర్ : కేయూ సెనేట్ హాల్‌లో రచయితలు, సాహిత్యాభిమానులు హాజరైన సదస్సుపై కొందరు యువకులు దాడి చేసి బీభత్సం సృష్టించిన ఘటన సిగ్గుచేటని సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ తీవ్రంగా ఖండించింది. సమావేశంలో రవీందర్, వెంకటస్వామి, కళ, శ్రీనివాస్, అవినాష్, పాణి, బాలరాజు, కె.శ్రీనివాస్, సుదర్శనం, ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో నారాయణ ఆల్‌టైం రికార్డు



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ విద్యాసంస్థల బాధ్యులు

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో హైదరాబాద్ నారాయణ విద్యాసంస్థల వరంగల్ బ్రాంచ్ నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని నారాయణ గ్రూప్ జీఎం కె.శ్రీనివాస్ తెలిపారు. ఎంపీసీలో పి.జాహ్నవి 470 మార్కులకు 469 మార్కులు సాధించి రాష్ట్ర, జిల్లాలో ప్రథమస్థానం సాధించారని తెలిపారు. ఎం.గగన్‌రెడ్డి 468 మార్కులు, బి.సింధుప్రియ 467 మార్కులు ఎ.నిఖిలేష్ 467 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే 460కిపైగా మార్కులు 18 మంది విద్యార్థులు సాధించారన్నారు. బీపీసీలో 440 మార్కులకు కె సంజనశ్రీ 436 మార్కులు, అలాగే డి.శ్రావిక 436 మార్కులు సాధించారని తెలిపారు. 400లకు పైగా ఐదుగురు సాధించారని తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో 1000 మార్కులకు జి అశ్రిత 990 మార్కులు సాధించారని తెలిపారు. హషితరెడ్డి 988 మార్కులు, బీపీసీలో ఎ.హర్షిత 986 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని విద్యాసంస్థల జీఎం కె శ్రీనివాస్, కోర్ డీన్ రాధాకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరంభం నుంచి ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్స్‌ను మైక్రో షెడ్యూల్స్‌గా రూపొందించి కాన్సెప్చువల్ ఓరియంటేషన్‌లో విద్యాబోధన చేయటంతోనే తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. తద్వారా తెలంగాణాలోని నారాయణ విద్యాసంస్థల్లో జూనియర్, సీనియర్ ఇంటర్‌లో అత్యధిక పాస్ పర్సెంటేజ్ సాధించటం జరిగిందని తెలిపారు. 45 ఏళ్ల ఈ మహా ప్రస్తానానికి కొనసాగింపుగా నేటి ఈ ఇంటర్‌లో సాధించిన అత్యుత్తమ మార్కులేనన్నారు. ఈ ఫలితాలు జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్ ఫలితాలకు ఆరంభమన్నారు. సమావేశంలో బ్రాంచ్ ఏజీఎం అనిల్ గవాస్కర్, ప్రిన్సిపాల్ కె తిరుపతిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె అశోక్ కుమార్, ఏఓ హరీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సిద్దోజు'కు జాతీయస్థాయి మహానంది అవార్డు



కాజీపేట అర్బన్ : తెలుగు భాషా పండిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, రచయిత, తెలుగు ఉపాధ్యాయుడు సిద్దోజు శ్రీనివాసాచారి సోమవారం జాతీయస్థాయి మహానంది అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాజ గాన సభ కళావేదికలో తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మహానంది పురస్కారాల అందజేత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమకొండకు చెందిన సిద్దోజు శ్రీనివాసాచారి రచించిన మహాభారతం పుస్తకానికి గాను మహానంది అవార్డును ఆయన అందజేసి ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ మాచవరం గౌరీశంకర్, జ్యోతిష్యుడు దైవాజ్ఞశర్మ, కమెడియన్ అప్పారావు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రైల్వే వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

కాజీపేట: దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగసంస్థగా గుర్తింపును సాధించిన రైల్వే వ్యవస్థను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం క్రమేపీ నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించడాన్ని ప్రజలు ఉద్యమాల ద్వారా ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య పిలుపునిచ్చారు. చౌరస్తాలో సోమవారం రైల్వే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ముద్రించిన బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

హన్మకొండ: హైదరాబాద్ విశ్వం ఎడ్యుకేట్ స్కూల్ ల్యాబ్ నిర్వహించిన జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని జునేరా అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 18 రాష్ట్రాల నుంచి 180 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ 2వ తరగతి జునేరా జాతీయస్థాయి ప్రథమ స్థానంలో నిలిచింది.ప్రిన్సిపాల్ జి.మత్యాస్‌రెడ్డి, డైరెక్టర్ సునీతారెడ్డి విద్యార్థినిని అందించారు.

అనుమతిలేని బ్రాంచీలను మూసివేయాలి

వరంగల్: వరంగల్ పోచమ్మమైదాన్, హనుమకొండలోని కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలలో ఆల్ఫోర్స్ జూనియర్ కాలేజీ నూతనంగా ప్రారంభించిన బ్రాంచీలకు ఇంటర్ బోర్డు నుంచి ఎలాంటి అనుమతి లేదని వీటిని వెంటనే మూసి వేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీంనవీద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకున్నా బ్రాంచీల్లో అడ్మిషన్లు చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

జున్ను షెడ్రిక్ సేవలు మరువలేనివి

దేశాయిపేట : నగరంలోని దేశాయిపేటకు చెందిన జున్ను షెడ్రిక్ సేవలు మరువలేనివని స్థానిక ప్రముఖులు తెలిపారు. ఆదివారం రాత్రి షెడ్రిక్ 30వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ దేశాయిపేటలో తనకున్న భవనాన్ని పేద ప్రజల విద్య నిమిత్తం కిరాయి లేకుండా పాఠశాలకు ఇచ్చారన్నారు. అదే కాకుండా శ్మశానవాటిక కోసం 5 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం ద్వారా సంపాదించడంలో కీలకపాత్రను పోషించారని వారు పేర్కొన్నారు.

తహసీల్దార్ ఎదుట వ్యక్తి బైండోవర్

హసన్‌పర్తి: 100 డయల్‌ను మిస్ యూజ్ చేస్తూ పోలీసులకు ఇబ్బందులకు గురిచేస్తున్న ఓ యువకుడిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకొని తహల్దార్ ప్రసాద్ ఎదుట బైండోవర్ చేశారు. మండలంలోని వంగపహాడ్‌కు చెందిన ముస్కు శ్యామ్‌రావు ప్రశాంత్ అదే గ్రామానికి గ్రామానికి చెందిన ముస్కు వీరేశంల మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఈక్రమంలో వారి మధ్య వివాదం నెలకొంది. తీసుకున్న డబ్బులు వీరేశం ఇవ్వడం లేదు. దీంతో శ్యామ్‌రావు ప్రశాంత్ ఈనెల 27న 100కు డయల్ చేశాడు. వెంటనే బ్లూకోర్ట్స్ బృందం సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. అయితే సివిల్ తగాదా ఉన్నందున కోర్టుకు వెళ్లాలని సలహా ఇచ్చారు. అంతటితో ఆగకుండా శ్యామ్‌రావు ప్రశాంత్ మళ్లీ ఈనెల 28న ఐదుసార్లు, 29న ఐదు సార్లు 100కు డయల్ చేశాడు. దీంతో గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తే అవకాశం ఉన్నందున శ్యామ్‌రావు ప్రశాంత్‌ను తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదు

వరంగల్ : ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని మార్కెట్ కమిటీ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలక నరసింహారెడ్డి అన్నారు. వరంగల్ మార్కెట్ కమిటీలో గ్రేడ్–2 కార్యదర్శి బియాబానీ ఈనెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్నారు.

కాజీపేట: ప్రజలతో మమేకమై పనిచేసినప్పుడే పోలీసులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని సీఐ వై.సుధాకర్ రెడ్డి అన్నారు. కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఉద్యోగ విరమణ చేసిన హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి దంపతులను సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు.

ఆర్ట్స్ కళాశాల వార్షిక నివేదిక ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన కళాశాల వార్షిక నివేదికను సోమవారం కేయూ వీసీ తాటికొండ రమేష్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతితో కలిసి ఆవిష్కరించారు. ఈ డాక్యుమెంటేషన్ భవిష్యత్‌లో కూడా ఉపయోగపడుతుందన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

హన్మకొండ అర్బన్ : రక్తదానం మరొకరికి ప్రాణదానం అని కార్పొరేటర్ మానస రాంప్రసాద్ అన్నారు. సోమవారం గ్రేటర్ పరిధిలోని 49వ డివిజన్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ వారు రక్తదాన శిబిరం నిర్వహించారు.

కేసీఆర్‌ను కలిసిన లీగల్ సెల్ నాయకులు

వరంగల్ లీగల్ : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు కలిశారు. ఓరుగల్లు ఉద్యమ న్యాయవాదుల సేవలను మరువలేమని, లీగల్ సెల్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్ర తి ఒక్కరిని పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని కేసీఆర్ భరోసా కల్పించినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరిక

మడికొండ: గ్రేటర్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండకు చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి రమేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు, ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి మహేందర్ ఆధ్వర్యంలో చేరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

హసన్‌పర్తి : వైఎస్ఎంపీపీ బండా రత్నాకర్‌రెడ్డి, అన్నాసాగరం మాజీ సర్పంచ్ అనసూర్య, మాజీ ఉపసర్పంచ్ సాయిలు, అన్నాసాగరం బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సురేష్, మాజీ వార్డు సభ్యుడు అశోక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మొట్టె కుమారస్వామి సోమవారం కాంగ్రెస్‌లో చేశారు.ప్రదేశ్ కాంగ్రెస్ చేరికల కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వృద్ధులకు అండగా రెడ్‌క్రాస్ సేవలు

హన్మకొండ అర్బన్ : వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలందించేందుకు రెడ్‌క్రాస్ సంచార వైద్యశాల సేవలు నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. ఐఆర్ఎస్, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం భీమదేవరపల్లి మండలంలోని వంగరలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలి

మడికొండ: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఎస్సీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ నార్లగిరి ప్రీతమ్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ పర్యటన సందర్భంగా మడికొండలో పీసీసీ ఎస్సీ సెల్ కో కన్వీనర్ ఎడబోయిన ప్రభాకర్ నివాసంలో ఆయన మాట్లాడారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ అర్బన్ : ఎర్లీబర్డ్ ఆఫర్ (5 శాతం రాయితీతో ఆస్తి పన్నుచెల్లింపు)ను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్ తెలిపారు. సోమవారం హనుమకొండ కు చెందిన అజరా హాస్పిటల్ యాజమాన్యం 5 శాతం రిబేట్ ద్వారా రూ. 16, 22,14 చెక్కును, భీమారం చెందిన ఎస్‌వీఎస్ కళాశాల యాజమాన్యం రూ.14, 11,522 చెక్కులను వేర్వేరుగా స్వీకరించారు.

ఉత్సాహంగా బాల సంస్కార్

హన్మకొండ అర్బన్ : చిన్నారులకు వ్యక్తిత్వ వికాసం, నైతిక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు వేసవిలో రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించే బాల సంస్కార్‌లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రస్తుతం ప్రారంభమైన కార్యక్రమం మే 8 వరకు కొనసాగుతుందని సమితి హనుమకొండ శాఖ నిర్వాహకులు తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఎంజీఎం : మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు పి లుపునిచ్చారు. సోమవారం కలెక్టర్ ఆదేశాల మే రకు వడ్డేపల్లి యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో కలిసి స్వీప్ అవగాహన ర్యాలీని ప్రారంభించారు.

దౌర్జన్యం మానుకోవాలి

కాశిబుగ్గ : ది ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు దౌర్జన్యం మానుకోవాలని ఫర్టిలైజర్స్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు వై.శ్రీధర్‌రెడ్డి, ఎండి నజీర్, మధుబాబు, మనోహర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసో సియేషన్ నాయకులు దౌర్జన్యం మానుకోపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

హన్మకొండ: భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా జనాభా దామాషా ప్రకారం అన్నిరంగాల్లో అసమానతలను రూపుమాపడానికి సామాజిక న్యాయ ఎజెండాను అమలు చేసి, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని దేశవ్యాప్తంగా రూపొందించాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలకర శ్రీనివాస్, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ ప్రచారోద్యమంలో భాగంగా సోమవారం హనుమకొండలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చుతామని ప్రకటిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను అగ్రకులాలకు అమలు చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల హక్కులను కాలరాస్తున్న బీజేపీని ఓడించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూమి లేని పేదలకు హక్కుగా భూపంపిణీ చేయాలన్నారు. సమావేశంలో బీసీ స్టడీ ఫోరం వ్యవస్థాపక కన్వీనర్ సాయిని నరేందర్, రైల్వే జాక్ చైర్మన్ కొంద్ర నర్సింగరావు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ సోమ రామ్మూర్తి, ఆయా సంఘాల నాయకులు కరుణాకర్, సురేష్, జైసింగ్ రాథోడ్, అప్పరావ్, దేవేందర్, సునీల్, కుమార్, ప్రసాద్, కొమురయ్య, నగేష్, జేజే స్వామి, మల్లేశం, యిలయ్య నవీన్, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ఖాయం



మాట్లాడుతున్న మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు

వరంగల్ చౌరస్తా : కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు అన్నారు. సోమవారం వరంగల్ ఆర్ఎస్‌టీ రోడ్డులో పట్టణ ఆర్యవైశ్య సంఘం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు పట్టణ ఆర్యవైశ్య సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ప్రకటించారు. బీఆర్ఎస్ ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌ని కూడా నియమించారని పేర్కొన్నారు. బీజేపీ దేవుని పేరుతో రాజకీయాలు చేస్తున్న పార్టీ అని ఇలాంటి పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని వి మర్శించారు. కార్యక్రమంలో వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోనుపునూరి వీరన్న, వరంగల్ జిల్లా ఆవోపా అధ్యక్షుడు మల్యాల వీర మల్లయ్య, వాసవి క్లబ్ వరంగల్ అధ్యక్షుడు బెలిదె వెంకటేశ్వర్లు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద మోదీని ఓడించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ కోశాధికారి రాములు

ఖిలా వరంగల్: రాబోయే ఎన్నికల్లో కార్మిక వ్యతిరేకి, మతోన్మాద మోదీని ఓడించాలని రాష్ట్ర సీఐటీయూ నాయకురాలు కాసు మాధవి, కోశాధికారి వంగూరు రాములు పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ ఉర్సు గుట్ట ఆర్ఎస్ భవనం, సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ఆధ్వర్యంలో ఎం.సాగర్ అధ్యక్షతన జరిగిన సీఐటీయూ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్‌కోడ్‌లుగా తెచ్చిందన్నారు. ఈ కోడ్‌తో కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఓట్లు పెరిగినా, సీట్లు పెరిగినా ప్రమాదమే అన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో వామపక్ష లౌకిక శక్తులు బలపరిచిన ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జన్ను ప్రకాశ్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, అప్పాజీ, రాజు, ఉపేందర్, యాదగిరి, ఇస్మాయిల్, రఘుపతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు

క్రైం కార్నర్

ఎండు గంజాయి పట్టివేత



ఖిలా వరంగల్: వాహన తనిఖీల్లో 5 కిలోల 700 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనపర్చుకుని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. సోమవారం మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గోవర్ధన్, మహిమూద్‌లతో కలిసి ఆయన కేసు వివరాలను వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం వరంగల్ ఆర్టీఏ జంక్షన్ వద్ద ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఆధ్వర్యంలో ఎస్సై గోవర్ధన్ తనిఖీలు చేపట్టారు. వరంగల్ మార్కండేయ నగర్ (మంగళమ్మకుంట)కు చెందిన జేసీబీ డ్రైవర్ సంపంగి రాకేష్(19), అదే కాలనీకి చెందిన ఊబిది వంశీ కృష్ణ(17) ఇద్దరు కలిసి భద్రాచలంలో ఓ వ్యక్తి వద్ద తక్కువ ధరకు 5కేజీల 700 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. భద్రాచలం నుంచి సంపంగి రాకేష్ 3 కేజీల గంజాయి బ్యాగు, వంశీకృష్ణ 2కేజీల 700 గ్రాముల గంజాయి భుజానికి వేసుకుని వరంగల్‌లోని మార్కండేయనగర్ మంగళమ్మకుంటలోని ఇంటికి బయల్దేరారు. సోమవారం మధ్యాహ్నం వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో ఎస్సై గోవర్ధన్ వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరి చేతుల్లో బ్యాగులు పట్టుకుని అనుమానాస్పదంగా కనిపించారు. బ్యాగులు పరిశీలించగా మొత్తం రూ.1.42లక్షల విలువైన 5కేజీల 700గ్రాముల శుద్ధిచేసిన ఎండు గంజాయి లభించింది. వెంటనే గంజాయి స్వాధీన పర్చుకుని నిందితులిద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లయ్య తెలిపారు. ఎస్సైలు మహిమూద్, గోవర్ధన్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

వరంగల్ క్రైం : హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీహాల్ దగ్గర గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. మృతురాలి వయస్సు 60– 65 మధ్య ఉండి, ఎరుపు, నీలి రంగు గల నైటీ ధరించి, బక్కచిక్కి ఉందని తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జంగం కృష్ణారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

రామన్నపేట : మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ సోమవారం వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ తెలిపారు. వరంగల్‌లోని ఏకశిల నగర్‌కు చెందిన సిలివేరు బాబు వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి చౌరస్తా వైపు తన మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా హెడ్‌పోస్టాఫీస్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా జడ్జి వీరస్వామి రెండు రోజుల శిక్ష విధించినట్లు తెలిపారు. తీర్పు అనంతరం నిందితుడిని పరకాల సబ్‌జైల్‌కు తరలించినట్లు తెలిపారు.

సహజీవనం చేశాడు...వద్దంటున్నాడు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

హసన్‌పర్తి: పెళ్లి చేసుకుంటానని సహజీవనం చేసి.. ఇప్పుడు వద్దంటున్నాడని బాధితురాలు కేయూ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ (40) అక్కడే డ్యాన్స్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తోంది. తొమ్మిదేళ్ల క్రితం భర్తతో విడాకులు తీసుకున్న ఆ మహిళకు గోదావరిఖనికి చెందిన సింగరేణి ఉద్యోగి సురేందర్‌తో పరిచయం ఏర్పడింది. వారి పరిచయం ప్రేమగా మారింది. దీంతో ఇద్దరు సహజీవనం చేయడం కొనసాగించారు. అయితే హనుమకొండ మండలం గోపాలపురంలో ఓ ఇంటిని అద్దె తీసుకుని వీరు వారానికి రెండు మూడు రోజులు ఇక్కడికి వెళ్లి వస్తున్నారు. కాగా, ఇటీవల పెళ్లి ప్రస్తావన తీసుకురాగా అందుకు సురేందర్ నిరాకరించాడు. దీంతో బాధితురాలు కేయూ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడిపై అత్యాచార కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హౌసింగ్ సొసైటీకి సంపూర్ణ సహకారాలు

హన్మకొండ అర్బన్ : టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీకి ఎల్లవేళలా తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని టీఎన్జీవోస్ కేంద్ర సంఘ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. నగరంలోని పలివేల్పులో టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా వారికి ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మించినందుకు పాలకవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వి.లక్ష్మణ్‌రావు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కేంద్ర సంఘం మాజీ అధ్యక్షులు కారం రవీందర్‌రెడ్డి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యోగ సంఘాల మాజీ జెఏసీ చైర్మన్ పరిటాల సుబ్బారావు, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్మోహన్‌రావు, జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు, టీఎన్జీవోస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్‌దే విజయం

హన్మకొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరుగనున్న ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని తీన్మార్ మల్లన్న అన్నారు. సోమవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగస్తులకు, నిరుద్యోగులను పట్టించుకున్న పాపానా పోలేదని విమర్శించారు. సమావేశంలో వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అల్వాల కార్తీక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్, పాల్గొన్నారు.